క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 38 మంది ఎంపిక



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో గల సూర్యసదన్ కల్యాణ మంటపంలో బుధవారం జరిగిన నేత్రవైద్య శిబిరంలో 38 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, సద్గురు కృష్ణయాజీ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వి.సూర్యనారాయణ శర్మ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యసదన్ కల్యాణ మంటపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 82 మందిని పరీక్షించారు. కార్యక్రమంలో గిరిజ, ఎస్.జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రైల్వేస్టేషన్‌లో పనులు పర్యవేక్షిస్తున్న అధికారుల బృందం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను రైల్వే అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. అమృత్ భారత్ పథకం నిధులతో స్థానిక రైల్వేస్టేషన్‌లో కొంత కాలంగా పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, డీఎస్‌టీఈ విజయ్ సైనీ, డీఈఈ అశోక్‌కుమార్, ఏఈఎన్ గౌరీనాయుడు, తదితరులు పనులు పరిశీలించి కాంట్రాక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ ఇప్పిలి నీలకంఠం పాల్గొన్నారు.

గుంతలు పూడ్చారు..



బొద్దాం - ముకుందపురం రోడ్డులో గుంతలు పూడ్చుతున్న దృశ్యం

వేపాడ: మండలంలోని బొద్దాం నుంచి క్లోంపూడి రహదారిలో ఏర్పడిన గుంతలను గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎర్రా సత్యవతి నేతృత్వంలో పంచాయితీ సిబ్బంది బుధవారం పూడ్చారు. కొద్ది రోజుల కిందట ఏపీ రైతుసంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నేతృత్వంలో స్థానిక యువత రోడ్డుపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. ఇందిలా ఉంటే బొద్దాం జంక్షన్ నుంచి ముకుందపురం వెళ్లే రోడ్డులో డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు బొద్దాం - క్లోంపూడి రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గో హంతకులను శిక్షించాలి



గుజ్జంగివలసలో నిర్బంధంలో ఉన్న ఆవులను పరిశీలిస్తున్న గో సంరక్షణ సమాఖ్య సభ్యులు

గుర్ల: మండలంలోని గూడెం గ్రామ శివారులోని టేకు తోటలో గోవులను నిర్బంధిస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, బీజేపీ మహిళా నేత పాక నాగమల్లిక రాణి డిమాండ్ చేశారు. గూడెం, గుజ్జంగివలసలో నిర్బంధంలో ఉన్న గోవులను వారు బుధవారం పరిశీలించారు. గోవులకు మేత వేసి, పరిస్థితిని పోలీసులకు వివరించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



విద్యార్థులతో పదాలు రాయిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. సోంపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో గణితం, తెలుగు పదాలను బోర్డుపై రాయించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు.

- సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని మంత్రి శ్రీనివాస్
- అదే బాటలో తహసీల్దార్ రత్నకుమార్ కూడా
- నేడు జరిగే సమావేశానికైనా హాజరవుతారా, లేదోనని సర్వత్రా చర్చ

ఈ సారైనా..!



ఎంపీడీఓ కార్యాలయం

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి చేపట్టాలన్నా.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నా ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సిందే.. అయితే వీరిలో ప్రధానంగా మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంది. సమావేశంలో ప్రస్తావనకు వచ్చే సమస్యలకు పరిష్కార మార్గం చూపడంతో పాటు అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12 నాటికి ఏడాది కాలం పూర్తయిన విషయం అందరికి తెలిసిందే. ఈ ఏడాది కాలంలో ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు సార్లు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశాలకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఒక్కసారి కూడా హాజరుకాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరైతే మండలంలో ఉండే సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడమో లేక అభివృద్ధి పనులపై చర్చించడమో జరుగుతుందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా మంత్రి ఒక్క సమావేశానికి కూడా హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మంత్రి తీరుపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది కాలంలో సమావేశాలు ఇలా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 21.08.2024, 17.11.024, 28.12.2024 (బడ్జెట్ సమావేశం), 23.03.2025న మండలి సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మంత్రి హాజరుకాలేదు. 19.06.25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. కనీసం ఈ సారైనా మంత్రి హాజరవుతారా, లేదా అని అందరూ ఎదురుచూస్తున్నారు.

మంత్రి బాటలోనే తహసీల్దార్ కూడా..

మండల సర్వసభ్య సమావేశాలకు మంత్రి శ్రీనివాస్‌తో పాటు స్థానిక తహసీల్దార్ రత్నకుమార్ కూడా హాజరు కాకపోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. మంత్రి శ్రీనివాస్ బాటలోనే తహసీల్దార్ రత్నకుమార్ పయనిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒక్క సమావేశానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. తర్వాత ఏ ఒక్క సమావేశానికి కూడా రాలేదు. ఈ నెల 19న జరగబోయే సర్వసభ్య సమావేశానికి వీరిరువురూ హాజరవుతారని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అదే కారణమా..?

మండలంలోని 26 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉండగా.. ఆరు పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. అలాగే 16 మంది ఎంపీటీసీ సభ్యులు కూడా వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గడిచిన ఆరు మాసాలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు, అలాగే మండల పరిషత్ అభివృద్ధి నిధులతో పాటు మరే నిధులు మంజూరు చేయలేదు. ఈ పరిస్థితుల్లో మండల సర్వసభ్య సమావేశాలకు మంత్రి హాజరైతే సభ్యులు ఎక్కడ నిలదీస్తారోనని భయంతోనే మంత్రి రావడం లేదన్న చర్చ సాగుతోంది. అలాగే మండలంలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి.. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.. ప్రభుత్వ భూములను ఇనాం భూములుగా పేర్కొంటూ పట్టాలిస్తున్నారు.. ఈ సమస్యలపై ఎక్కడ ప్రశ్నిస్తారోనని భయపడే తహసీల్దార్ కూడా సమావేశాలకు రావడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నేడు జరగబోయే సమావేశానికైనా వీరు హాజరవుతారో, లేదో వేచి చూడాలి.

వెన్నుపోటు పుస్తకావిష్కరణ



జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం, వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శృంగవరపుకోట: 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం, వెన్నుపోటు' అన్న పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుధవారం ఆవిష్కరించారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మంటపంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచనలతో ఎస్.కోట మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలన మోసం, కుట్రలతోనే నడుస్తోందన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన, నిరుద్యోగభృతి అని ఆశ కల్పించి అన్యాయం చేశారని ఆరపించారు. ఎండీయూ ఆపరేటర్లను పీకేసి, మద్యం పాలసీ మార్చేసి వేలాది మంది యువతను రోడ్డు పాల్జేసిందని మండిపడ్డారు. నాడు జగనన్న ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేస్తే.. నేడు డిపోల వద్ద గంటల తరబడి క్యూలో నిలుచోవాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు వాస్తవాలు చెప్పి ప్రజల అవసరాలు, హామీలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వాకాడ రాంబాబు, పట్టణ అధ్యక్షుడు షేక్ రహమాన్, సర్పంచ్ కె.వెంకటరావు, పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ పి.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పి.ధర్మారావు, పి.సుధాకర్,పి.గణేష్, కె.జయశంకర్, ఎంపీటీసీ సభ్యులు అప్పయ్య, బి.రమేష్, వార్డుమెంబర్లు మజ్జి శేఖర్, ఎలమంచిలి అప్పారావు, అప్పలసత్యం, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు



విత్తన పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: ప్రతి రైతుకీ రాయితీపై వరి విత్తనాలు అందజేయాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం వద్ద విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, వ్యవసాయశాఖ ఏడీ ఎల్.విజయ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత



నగదును మహిళకు అందజేస్తున్న పోలీసులు

గజపతినగరం రూరల్: ఆటోలో బ్యాంక్‌కు వెళ్తూ రూ.30 వేల నగదు పోగొట్టుకున్న మహిళకు 12 గంటలు గడవక ముందే గజపతినగరం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పోగొట్టుకున్న నగదును మహిళలకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి ఎదురుగా ఉండే కాలనీలో నివాసం ఉండే పార్వతి బ్యాంక్‌లో రూ.30 వేల నగదు డిపాజిట్ చేసేందుకు మంగళవారం సాయంత్రం ఆటోలో బయలుదేరింది. బ్యాంక్ వద్దకు వచ్చేసరికి నగదుతో కూడిన పర్సును ఆటోలో మర్చిపోయి.. బ్యాంక్‌కు వెళ్లి చూడగా నడదు కనిపించకపోవడంతో తక్షణమే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరించి 12 గంటలు గడవక ముందే పొగొట్టుకున్న నగదును ఆమెకు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వియ్యంపేట పీహెచ్‌సీ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు ఎల్.సత్యారావు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డైయేరియా, చికెన్‌గునియా, పచ్చకామెర్లపై అప్రమత్తంగా ఉంటూ.. సకాలంలో వైద్యసేవలు పొందాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అరుకు, పాడేరు, దేవరాపల్లి, సాలూరు, మక్కువ, పార్వతీపురం నుంచి వచ్చిన విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది ఈశ్వరరావు, సత్యారావు, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు

మెరకముడిదాం: రైతులు తమ భూములకు సంబంధించి భూసార పరీక్షలను చేయించుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ ఆర్.దేవుడుబాబు సూచించారు. మండలంలోని యాడిక గ్రామంలో రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయ పరికరాల వినియోగం – వాటి వలన కలిగే లాభాలు అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యంత్రాలు వినియోగించడం వల్ల కూలీల ఖర్చు, మదుపులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స మోహనరావు, ఎ.వెంకటరమణ, ఎం.చంద్రశేఖర్, బైరెడ్డి కామేష్, పి.శ్యామ్‌కుమార్, వై.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని



యోగా చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డి పావని

గజపతినగరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డి పావని అన్నారు. మండల పరిధి పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆమె పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిరోజూ యోగాసనాలు వేయడం వల్ల ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చాన్నరు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎమ్ చిప్పాడ రమేష్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కరరావు, దొగ్గ దేవుడుబాబు, ఏడుకొండలు, పి.గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ పనుల్లో కదలిక



ప్రారంభమైన బ్రిడ్జి వాల్ పనులు

చీపురుపల్లి: పట్టణంలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనుల్లో కదలిక వచ్చింది. ఇప్పటికే ఆర్ఓబీ పనులు నత్తనడకన సాగుతున్నట్లు చర్చ జరుగుతోంది. అయితే తాజాగా బ్రిడ్జి వాల్ పనులు ప్రారంభించడంతో హమ్మయ పనుల్లో కదలిక వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. నెల రోజుల కిందటే ప్రధాన బ్రిడ్జి పనులు నిర్వహించారు. తర్వాత పనుల్లో జాప్యం ఏర్పడింది. తాజాగా బ్రిడ్జి వాల్ పనులు చేపడుతున్నారు. మరో వైపు అప్రోచ్ రోడ్‌కు సంబంధించి గ్రావెల్ కూడా వేస్తున్నారు. పట్టణం నుంచి రిక్షా కాలనీకు వెళ్లే సర్వీస్ రోడ్ సమస్య పరిష్కారం జరిగితే త్వరితగతిన బ్రిడ్జి పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు



రక్తదానం చేస్తున్న దాతలు

గంట్యాడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్లడ్‌బ్యాంక్‌ల్లో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున.. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించడం కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరికిరణ్, సీఎస్‌డీటీ మూర్తి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడున్న ఫీల్డ్ అసిస్టెంట్‌నే కొనసాగించండి

- విచారణాధికారులకు స్పష్టం చేసిన వేతనదారులు
- ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- విచారణ సమయంలో భైరిపురం సచివాలయం వద్ద ఉద్రిక్తత
- విచారణను వాయిదా వేసిన అధికారులు



విచారణకు వస్తున్న అధికారుల కారు ముందు నినాదాలు ఇస్తున్న వేతనదారులు

మెరకముడిదాం: మాకు ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌నే కొనసాగించండి.. అతను ఏ తప్పూ చేయలేదు.. అతనిపై ఎవరు ఫిర్యాదు చేశారు.. అంటూ మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులు అధికారులను నిలదీశారు. మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ బూడు శ్రీనుపై అదే గ్రామనికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కెంగువ ధనుంజయతో పాటు మరో 20 మంది పనులకు హాజరుకాని వారికి మస్తర్లు వేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధి పీడీ ఆదేశాల మేరకు ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఇన్‌చార్జ్ ఉపాధి ఏపీఓ కామేశ్వరరావు, ఈసీ నరేంద్రకుమార్, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ సుధాకర్‌పట్నాయక్ బుధవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో వేతనదారులు పెద్ద మొత్తంలో సచివాలయం వద్దకు చేరుకుని అధికారుల కార్ల ముందు బైఠాయించారు. దీంతో ఎంపీడీఓ భాస్కరరావు సహా అధికారులంతా వేతనదారులతో మాట్లాడేందుకు ప్రయత్నించేసరికి.. మాకు ఇప్పుడున్న ఫీల్డ్ అసిస్టెంట్ బూడు శ్రీనే కావాలని, అసలు అతనిపై ఎవరు ఫిర్యాదు చేశారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో సచివాలయం వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దీంతో విచారణను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు చెప్పి వెనుదిరిగారు. విచారణలో వైఎస్సార్‌సీపీ నాయకులు పప్పల కృష్ణమూర్తి, కందుల మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

దొంగ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు

గుర్ల: ఉపాధి హామీ పథకంలో దొంగ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి, ఏపీఓ రత్నమాల హెచ్చరించారు. మండలంలోని గోషాడ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ దొంగ మస్తర్లపై బుధవారం విచారణ చేపట్టారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కలిపి దొంగ మస్తర్లు వేస్తున్నట్లు గుర్తించారు. టెక్నికల్ అసిస్టెంట్ జగన్నాథంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని కావాల్సిన వారిందరికీ పని కల్పించాల్సిన బాధ్యత మేట్లపై ఉందని ఏపీఓ సూచించారు. దివ్యాంగులను వారి కుటుంబ సభ్యులున్న గ్రూపులలో చేర్పి పని కల్పించాలని ఆదేశించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం అందుకున్న బదిలీ ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన 12 మంది ఉపాధ్యాయులకు హెచ్‌ఎం జామి అప్పలనాయుడు ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో బుధవారం ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ.. పాఠశాల నుంచి ఒకే సారి 12 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం కొంత బాధగా ఉందన్నారు. ఉపాధ్యాయుల చొరవతో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ కావాలా.. కూటమి నేతలను కలవండి

గుర్ల: సచివాలయ ఉద్యోగులకు కావాల్సిన చోట బదిలీ కావాలా.. కూటమి నేతలను కలవాలని ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది ఒకరు సెలవిస్తున్నారు. ఈయన మాటల ప్రకారం మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న 60 మంది ఉద్యోగులు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలను కలిశారు. అయితే జిల్లా, మండల స్థాయి అధికారులు చేయాల్సిన బదిలీలు.. టీడీపీ నాయకులు వారి పార్టీ కార్యాలయంలో కూర్చొని చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని మండల పరిషత్ ఏఓ వరప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. సచివాలయ సిబ్బందిని టీడీపీ నేతలను కలవమని చెప్పలేదన్నారు.

యాప్‌లో అప్‌లోడ్ చేయండి



సూచనలిస్తున్న ఎంఈఓలు, ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగా రిజిస్ట్రేషన్ చేసుకుని లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ఎంపీడీఓ సూర్యనారాయణ సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్‌ను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్న సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

వితరణ



నగదు అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి పుర్రేయవలస సర్పంచ్ సారిక మోహన్ నేతృత్వంలో కంది అప్పలనాయుడు, సారిక రామారావు, టంకాల రామకృష్ణ, అప్పలనారాయణ, పెద్దింటి సత్యం, పెద్దింటి సీతారాములు, హైమావతి, కనకరాజు, చిరంజీవి, రాంబాబు, తదితరులు రూ.లక్ష ఆర్థిక సహకారం అందించారు. అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గవిడి నాగరాజు, పాట్నూరు త్రినాథ్‌లకు నగదు అందజేశారు.

ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి

- బీసీ సంక్షేమ, చేనేత జౌళీ శాఖా మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

గంట్యాడ: ప్రస్తుత తరంతో పాటు, భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా అలవర్చు కోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి యోగాంధ్ర కార్యక్రమ సన్నద్ధతపై మండలంలోని కొటారుబిల్లి టీటీడీ కల్యాణ మంటపంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ ద్వారా ప్రపంచం మొత్తం మనవైపు చూస్తోందన్నారు. 2015లో ఐక్యరాజ్య సమితి యోగా దినోత్సవాన్ని ప్రతిపాదించగా.. 2016 నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగా వ్యాధులను దూరం చేసి జీవితాలను సుఖమయం చేస్తుందన్నారు. ప్రధాని మోదీ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఎటువంటి ఆటంకం కలగకుండా అన్నిరకాల ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించే అవకాశం రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, ఇన్‌చార్జ్ ఆర్డీఓ సవరమ్మ, ఎంపీడీఓ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి..

లక్కవరపుకోట: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి స్వగృహం వద్ద యోగాంధ్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ నెల 21న యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి కనీసం 5 వేలు మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను మంత్రి పరిశీలించారు. పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ విద్యార్థినులు మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో, కందుకూరి ఎమ్మెల్యే ఇ.నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.